ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 29 నవంబరు 2025



ధాన్యం.. వానరదండు పాలు

మల్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వానరదండుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తీసుకు వచ్చిన ధాన్యంపై కోతుల సమూహం దాడులు చేస్తూ రైతులను నష్టపరుస్తున్నాయి. మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై ఇలా కోతులు వచ్చి చేరాయి. నిత్యం కోతుల సమూహంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు అంటున్నారు.



నామినేషన్ కేంద్రాల ఏర్పాటు

బీర్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30 నుంచి నిర్వహించే రెండో విడత స్థానిక సంస్థల ఎన్నికల కోసం బీర్‌పూర్ మండలంలోని 17 గ్రామాలకు నాలుగు నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో భీమేష్ ఒకప్రకటనలో తెలిపారు.


- బీర్‌పూర్ గ్రామపంచాయతీలో బీర్‌పూర్, నర్సింహులపల్లి, ఇందిరానగర్
- కొల్వాయి గ్రామపంచాయతీలో తుంగూర్, కందెనకుంట, కొల్వాయి, చిన్న కొల్వాయి, కోమన్‌పల్లి
- తాళ్లధర్మారం గ్రామపంచాయతీలో తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం, రేకులపల్లి, కమ్మునూర్
- మంగెళ గ్రామ పంచాయతీలో మంగెళ, గోండుగూడెం, కండ్లపల్లి, చర్లపల్లి, రంగసాగర్ గ్రామాల సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయవచ్చని పేర్కొన్నారు.

ఆలయంలోని మిశ్రమ బియ్యం వేలం

బీర్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో డిసెంబరు నెల 3వ తేదీన ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఎనిమిది నెలల నుంచి భక్తులు సమర్పించిన మిశ్రమ బియ్యం సుమారు నాలుగు క్వింటాళ్ల వరకు ఉన్నాయని బియ్యాన్ని బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఈ వేలంలో పాల్గొనే వారు 1000 రూపాయల డిపాజిట్ చెల్లించాలని, ఎవరైతే కిలో ఒక్కం టికి ఎక్కువగా వేలం పాట పాడుతారో వారినే హెచ్చు పాటాదారుగా భావించి వారికి మొత్తం బియ్యం తూకం వేసి అప్పగిస్తామని తెలిపారు.

ఖర్చుల గుబులు

- గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి
- దావత్‌లు, మందు పార్టీల జోరు
- చివరి విడత ఆశావహులకు తలకుమించిన భారం
- జిల్లాలో 385 పంచాయతీలు.. 3,536 వార్డులకు ఎన్నికలు



జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి జోరందుకుంది. ఆశావహులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి దావత్‌లు, మందు పార్టీల కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఆశావహులు ఖర్చు చేస్తున్నప్పటికీ వారికి డబ్బుల టెన్షన్ పట్టుకుంది. మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడత ఎన్నికల అభ్యర్థులకు ఖర్చులు కలిసి వచ్చే అంశం కాగా చివరి విడత వారు అదనంగా భారం మోయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి నుంచి 20 రోజుల పాటు ఎన్నికల ప్రచారంతో పాటు క్యాడర్‌ను కాపాడుకునేందుకు వారి కోరికలు తీర్చడం లాంటి ఖర్చులు భరించాల్సి ఉంటుంది.

ఓటర్లను ప్రభావితం చేసే పెద్దలను, కుల, మహిళా సంఘాలు, యూత్ లీడర్లను మచ్చిక చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల ఖర్చుల అంచనా లెక్కలు చూసి ఆశావహులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎంత ఖర్చయినా మంచిదే అంటూ డబ్బులు దారబోస్తే గెలువకపోతే ఎలా అనే భయం మరో వైపు కనబడుతోంది. గెలుపు గుర్రాలపై ప్రధాన పార్టీలు ఆరా తీయడంతో పాటు డబ్బులు ఖర్చు చేసే వారిని సంప్రదిస్తున్నారు. నెలన్నర క్రితం విడుదల అయిన స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌తో కూడా కొంత మంది ఆశావ హులు డబ్బులు ఖర్చుచేసి రద్దు కావడంతో చేసేదేమీ లేక క్యాడర్‌ను కాపాడుతున్నారు.

6.07 లక్షల మంది ఓటర్లు..

జిల్లాలో 20 మండలాల్లో 385 గ్రామ పంచాయతీలు, 3,536 వార్డులు ఉన్నాయి. మొత్తం 6,07,263 మంది ఓటర్లు ఉన్నారు. ఒకటో విడత డిసెంబరు 11న కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, వేములవాడ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో జరుగుతాయి. రెండో విడత జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు మండలాలు, చొప్పదండి నియోజకవర్గంలోని రెండు మండలాల్లో, మూడో విడత ధర్మపురి అసెంబ్లీ నియో జకవర్గంలోని ఆరు మండలాల్లో జరగనున్నాయి. ఈనెల 27వ తేదీ నుంచి మొదటి విడత నామినేషన్ల స్వీకరణ మొదలైంది. ఆశావహులు ఖర్చులు కూడా మొదలు పెట్టారు.

మూడో విడత డబుల్ ఖర్చులు...

మూడో విడత ఎన్నికలు ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, వెల్గటూరు, గొల్లపల్లి, పెగడపల్లి మండలాల్లో జరుగనున్నాయి. మూడో విడతలో ఉన్న మండలాల జీపీల్లో ఆశావహులు ఇప్పటి నుంచి 20 రోజులకు పైగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. మొదటి విడత వారితో పోల్చుకుంటే వారి ఖర్చులు రెట్టింపు కానున్నాయని ఆశావహులు ఆందోళన పడుతున్నారు. ఇప్పటికే కొంత మంది పోటీలో ఉన్నామని బయటపడగా మరి కొంత మంది ఖర్చులకు భయపడి బయటకు రావడం లేదు. ఇప్పటికే ఆశవహులు యూత్ లీడర్లు, వార్డు లీడర్లకు పార్టీలకు అతీతంగా దావత్‌లు, పార్టీల్లో ముంచుతున్నారు. దీంతో ఖర్చులు తడిపిమోపడవుతున్నాయని తలలు పట్టుకుంటున్నారు.

పరిమితికి మించి..

స్థానిక సంస్థల ఎన్నికల ఖర్చులకు ఎన్నికల కమిషన్ వ్యయపరిమితి విధించింది. ఐదువేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ. 2.50 లక్షలు, వార్డు సభ్యుడికి రూ. 50 వేలు, ఐదు వేల కంటే తక్కువ జనాభా ఉన్న జీపీల్లో సర్పంచులు రూ. 1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ. 30 వేలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ... (మిగతా 8లో..)

రెండోరోజు సర్పంచ్ స్థానాలకు 248 నామినేషన్లు

- వార్డు స్థానాలకు 422 దాఖలు

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు సర్పంచ్ స్థానాలకు 248 నామినేషన్లు, వార్డు స్థానాలకు 422 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రఘువరన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో తొలి విడతలో 122 సర్పంచ్, 1,172 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలను నిర్వహించడానికి నామినేషన్ల స్వీకరణను ప్రారంభించారు. సర్పంచ్ స్థానాలకు భీమారం మండలంలో 35 నామినేషన్లు, ఇబ్రహీం పట్నంలో 33, కథలాపూర్‌లో 39, కోరుట్లలో 25, మల్లాపూర్‌లో 49, మేడిపల్లిలో 26, మెట్‌పల్లిలో 41 నామినేషన్లు దాఖలు అయినట్లు ప్రకటించారు. వార్డు సభ్యుని స్థానానికి భీమారం మండలంలో 50, ఇబ్రహీంపట్నం మండలంలో 72, కథలాపూర్ మండలంలో 103, కోరుట్ల మండలంలో 53, మల్లాపూర్ మండలంలో 46, మేడిపల్లిలో 16, మెట్‌పల్లి మండలంలో 82 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లాలో ఇప్పటి వరకు సర్పంచ్ స్థానాలకు 297 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 456 నామినేషన్లు వచ్చినట్లు డీపీవో తెలిపారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ అధికారులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం బల్దియా అధికారులతో ఎమ్మెల్యే జగిత్యాల పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ కారణాలతో నిలిచిపోయిన పనుల విషయంలో టెంటర్ రద్దు చేసి ఇతర ప్రాంతాలకు ఆ నిధులను కేటాయించాలన్నారు. ప్రాధాన్య క్రమాన్ని బట్టి నూతన అభివృద్ధి పనుల అంచానాలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఈ ఆనంద్, వరుణ్, ఏఈలు అనిల్, లక్ష్మి ఇతర అధికారులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీసీసీ అధ్యక్షుడు

జగిత్యాల అర్బన్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన గాజంగి నందయ్య జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. నందయ్య ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి శాలువాతో సత్కరించారు.

- డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్యను మల్యాల పద్మశాలి సంఘం నాయకులు సన్మానించారు. పద్మశాలి సంఘం మల్యాల పట్టణ అధ్యక్షుడు బోడ గోవర్ధన్, కార్యదర్శి తాటిపాముల రాజేందర్, శ్రీహరి తదితరులు నందయ్యను కలిసిన వారిలో ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పల్లెల అభివృద్ధి


కథలాపూర్‌లో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

కథలాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందిస్తున్న నిధులతోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయని రాజన్నసిరిసిల్ల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ వద్ద చిల్లి గవ్వ లేదని కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించే పరిస్థితి లేదని చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు గ్రామపంచాయతీలకు నిలిచిపోవడంతో అభివృద్ధి పడకేసిందన్నారు. విధిలేని పరిస్థితుల్లోనే స్థానిక పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులే కాకుండా ప్రధాన మంత్రి సడక్‌యోజన, సీఐఎఫ్ వంటి నిధులతో గ్రామాల్లో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థులనే గెలిపించాలని కోరారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, మాజీ అధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, కంటె సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కథలాపూర్ మహేశ్, గాంధారి శ్రీనివాస్, నరెడ్ల రవి, బీజేవైఎం అధ్యక్షుడు ఆరె శివ, ప్రమోద్ ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని ఆడి టోరియంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్వోలకు, ఏఆర్వోలకు ఫేజ్- 2 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమా న్ని వీడియో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తూ ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలె క్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిం చాలంటే నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు చాలా ముఖ్యమైన అంశమని, దీనిపైన చాలా కేసులు దాఖలు అయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని తెలిపారు. అధికారిక ప్రకారం మాత్రమే రిజర్వేషన్ అంశా లను పరిశీలించాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత మండల తహసీల్దార్లను సంప్రదించాలని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా సర్పంచ్ అభ్యర్థికి ఎనిమిది, వార్డు సభ్యులకు ఆరు కంటే ఎక్కువ నామినేషన్ దాఖలు అయితే తమకు తెలియజేయాలని అన్నారు. అభ్యర్థుల వివరాలు నామినేషన్ పత్రాల్లో పూర్తిగా నమోదు చేయాలని, లేకుంటే నామినేషన్‌ను తిరస్కరించాలని సూచించారు. ప్రతీ చిన్న అంశాన్ని, అనుమానాలను శిక్షణలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి గ్రామపంచాయతీ ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బందీగా నిర్వహణకు అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్‌కు ఒక రోజు ముందుగా కొత్త బ్యాంక్ ఖాతా తీసుకునే విధంగా వారికి తెలియజేయాలని సూచించారు.

ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ ఒరిజినల్ పత్రాలను సంబంధిత గ్రామ పంచాయతీలలోని ఆర్వోల వద్ద పొందవచ్చని తెలిపారు. జిరాక్స్ కాపీలు వాడవద్దని, వార్డుసభ్యుడు పోటీ కోసం అదే వార్డు సభ్యుడు ప్రొపోజర్‌గా ఉండాలని, సర్పంచ్‌గా పోటీచేసే అభ్యర్థి డిపాజిట్ కింద కేటగిరి వారీగా చెల్లించాలని, ఏమైనా అప్పీల్ ఉంటే ఆర్డీవోను సంప్రదించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజగౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జనరల్ అబ్జర్వర్ జి. రమేష్, జిల్లా వ్యయ పరిశీలకులు మనోహర్, అడిషనల్ డీఆర్‌డీవో మదన్ మోహన్, డీపీవో రేవంత్, జిల్లా నోడల్ అధికారులు, జిల్లా ఎన్నికల విభాగం, అధికారులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధిద్దాం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కోరుట్ల నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా ముందుకు సాగి పంచాయతీ ఎన్నికలో విజయం సాధిద్దామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని సినారే కళా భవనంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్ని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇటీవల కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపి కైన నందయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీకి పునాది లాంటివని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నా మని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థుల గెలుపునకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పన్నాల అంజిరెడ్డి, మున్సిపల్ మాజీ చెర్మన్ శీలం వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, నాయకులు తిరుమల గంగాధర్, గడ్డం వెంకటేష్‌గౌడ్, ఎలేటి మహిపాల్‌రెడ్డి, అన్నం అనిల్, ఆకుల లింగారెడ్డి, ఎంబేరి సత్య నారాయణ, ఎడ్ల రమే ష్, గడ్డం కిరణ్, మచ్చ కవిత, శంకర్ పాల్గొన్నారు.

సర్పంచ్ బరిలో నిలవాలని.. ఉద్యోగం వదిలి..


తిరుపతి నాయక్

రాయికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించాలని చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి సర్పంచ్‌గా పోటీకి సన్నద్ధత అవుతున్న యువకుని ఉదంతం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మండలంలోని దావన్‌పెల్లి గ్రామానికి చెందిన బానావత్ తిరుపతి జగిత్యాల మెడికల్ కళాశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో అనస్తీషియా టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో తాను తన గ్రామానికి సేవ చేయాలనే ఆలోచనతో తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. సర్పంచ్‌గా బరిలో నిలిచి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని సన్నాహాలు చేస్తున్నాడు.

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సత్య ప్రసాద్


జెండా ఊపి ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యకుమార్, ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎన్నికల విధులకు సంబంధించి ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టీ టీంలకు జిల్లా ఎన్నికల వ్యయ పరిశీల కుడు మనోహర్, ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం రూ. 50 వేలలోపు నగదు మాత్రమే తమ వెంట తీసుకెళ్లాలని, ఆపైబడి నగదుకు సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికలు నిష్పాక్షికంగా నిర్వహించడంలో అధికార బృందాల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ప్రత్యేక బృందాల్లో తప్పనిసరిగా మేజిస్ట్రేట్ స్థాయి అధికారి ఒకరు, నలుగురు పోలీసు సిబ్బంది, అవసరమైతే కెమెరామెన్, వెబ్ క్యామ్ సామగ్రి, ప్రత్యేక వాహనం ఉంటాయన్నారు. ఎన్నికల అధికారులు, పోలీసులకు వచ్చే సమాచారం, పౌరులు చేసే ఫిర్యాదుల ఆధారంగా వీరి కార్యాచ రణ ఉంటుందని వివరించారు. ఎన్నికల సందర్భంగా ఆయా పార్టీల నాయకులు పెట్టే ప్రలోభాలు, ఇచ్చే బహుమతులు, పంచే డబ్బులు, మద్యం వంటి వాటిపై కూడా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు దృష్టిసారించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు, ఎన్నికల ఏర్పాట్లు, ప్రక్రియను పరిశీలించాలని, అవసరమైతే స్థానిక అధికారులకు సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌ల విధి నిర్వహణ ఎప్పటికప్పుడు కెమెరాలో రికార్డు అవుతుందని, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిందని, ఉల్లఘించిన వారిపై తీసుకున్న చర్యలపై రోజువారీ నివేదిక అందించేలా సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలను జెండా ఊపి కలెక్టర్ సత్యప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, నోడల్ అధికారులు రఘువరన్, మదన్ మోహన్, బోన గిరి నరేశ్, పల్లి నరేశ్, రేవంత్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ హరిణి పాల్గొన్నారు.

కోతిని పట్టు... సర్పంచ్ సీటు కొట్టు
- పంచాయతీ ఎన్నికల్లో 'కోతి' తిప్పలు
- వానరాల బెడద తీర్చినవారికే ఓట్లు
- గ్రామాల్లో తీర్మానాలు 7

ఎన్నికల విధులు అత్యంత కీలకం
పంచాయతీ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రమేష్ 8

సర్పంచ్‌గా పోటీ చేయడానికి అర్హతలు ఇవే 8

తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లి మృతిని తట్టుకోలేక తనయుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత(56) సిరిసిల్ల పట్టణంలో మానేరు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇది తట్టుకోలేక కుమారుడు మంచికట్ల అభిలాష్(34) అదే మానేరు నదిలో దూకిఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం తండ్రి మంచికట్ల దేవరాజ్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దేవరాజు పవర్‌లూం కార్మికుడిగా, లలిత బీడీ కార్మికురాలిగా పనిచేస్తూ కొడుకు, ఇద్దరు కూతుళ్లను పోషించారు. కుమారుడు అభిలాష్ కానిస్టేబుల్‌గా 2013 సంవత్సరంలో ఉద్యోగం సాధించాడు. ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం మంచికట్ల దేవరాజ్ మృతిచెందాడు. ఇద్దరు ఆడపిల్లల పెళ్లిలను తల్లి లలిత, కుమారుడు అభిలాష్‌లు చేశారు. వారం రోజులుగా లలిత మానసిక పరిస్థితి బాగాలేదని బంధువులు చెప్పారు. అభిలాష్ విధులకు హాజరై గురువారం ఇంటికి వచ్చేసరికి తల్లి కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. మిత్రులతో కలిసి తల్లి ఆచూకీ కోసం వెతికారు. శుక్రవారం మధ్యాహ్నం సిరిసిల్ల ఎల్లమ్మ గుడి సమీపంలో మానేరు నదిలో లలిత మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న అభిలాష్, మిత్రులతో కలిసి మానేరు నది తీరానికి చేరుకుని తల్లి మృతదేహాన్ని చూసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. బంధువులు, మిత్రులు ఓదారుస్తుండగానే ఒక్కసారిగా మానేరు నదిలోకి దూకాడు. మిత్రులకు ఈత రాకపోవడంతో కేకలు వేస్తుండగా అక్కడికి చేరుకున్న పోలీసులు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు చేపట్టారు. పట్టణ సీఐ కృష్ణతో పాటు సిబ్బంది, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం సుమారు రెండు గంటల పాటు గాలింపు చేపట్టిన తర్వాత అభిలాష్ మృతదేహం బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట పొలంపై అడవిపందుల దాడి


పంటను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రంగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పంట పొలాలపై అడవిపందులు దాడి చేశాయి. కంటె రెడ్డి అనే రైతుకు చెందిన ఎకరం వరి పంట నష్టం చేయడంతో సుమారు 50 వేల నష్టం జరిగిందని రైతు తెలిపారు. అడవిపందులు, జంతువులు తరచూ పంటపొలాలపై దాడి చేస్తున్నాయని, వాటివల్ల పంట నష్టం అవుతోందన్నారు. గతంలో అడవిపందుల దాడిలో చాలామంది రైతులకు గాయాలు అయ్యాయని, దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. అడవిపందుల దాడిలో నష్టపోయిన పంటను వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి పరిశీలించి నష్టపరిహారం కోసం సంబంధిత అధికారులకు నివేదిస్తామన్నారు.

విద్యార్థులకు స్కౌట్స్ శిక్షణ

- దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం పెంపు
- పీఎం శ్రీ మోడల్ స్కూళ్లలో యూనిట్ల ఏర్పాటు




ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లె కేజీబీవీలో స్కౌట్స్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

ఇల్లందకుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ, అంకితభావం పెంపొందించేందుకు శిక్షణ ఇవ్వనుంది. శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం, ఉజ్వల భవిష్యత్‌కు ఈ శిక్షణ ఎంతగానో తోడ్పడనుంది. పీఎంశ్రీ మోడల్ స్కూల్, టీఆర్ఈఐఎస్ స్కూళ్లతో పాటు కేజీబీవీల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో ఇల్లందకుంట మండలంలోని మోడల్ స్కూల్‌లో 177 మంది విద్యార్థులు, కేజీబీవీలో 286 మంది విద్యార్థులకు విడతల వారీగా 64మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తారు. ఒక్కో విద్యార్థికి రూ.2 వేల చొప్పున నిధులు మంజూరు చేయగా నిర్వహణకు వెచ్చించనున్నారు.

● చురుకైన బాలికలకు ప్రాధాన్యం

కేజీబీవీల్లో 6వ తరతగతి నుంచి 9వ తరగతి బాలికలకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో అవకాశం కల్పిస్తారు. ఇందులో చురుకైన విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేజీబీవీ పాఠశాల నుంచి 32మంది విద్యార్థినిలతో యూనిట్లు ఏర్పాటు చేస్తారు. యూనిట్‌లో చేరే విద్యార్థునులకు ప్రత్యేక యూనిఫామ్ అందజేస్తారు. నిత్యం సాధన, కవాతు, సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తారు.

● ప్రతి ఏటా మూల్యాంకనం

స్కౌట్స్ అండ్ గైడ్స్ పనితీరును జిల్లా స్కౌట్స్ కమిషన్ ఏటా మూల్యాంకనం చేస్తారు. మూడేళ్ల శిక్షణ పూర్తయిన తర్వాత రాష్ట్ర గవర్నర్ సంతకంతో కూడిన సర్టిఫికెట్ అందజేస్తారు. నాలుగేళ్లు పూర్తయితే రాష్ట్రపతితో సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

● పాఠశాలల్లో కూడా...

పీఎం శ్రీ పాఠశాలతో పాటు మోడల్ స్కూళ్లలో కూడా స్కౌట్స్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఇల్లందకుంట మండలంలోని కేజీబీవీలో 32మంది, మోడల్ స్కూల్‌లో 32మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

● ప్రయోజనం ఇలా..

స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వం, పట్టు, జట్టు కృషి, నాయకత్వం, సమస్య పరి ష్కారం, విధి నిర్వహణ, క్రమశిక్షణ, సేవ విలువలు పెంపొందుతాయి. క్రమం తప్పకుండా సమాజసేవ ద్వారా పౌరసత్వాన్ని నిర్మిస్తుంది. వారాంతపు బహి రంగ కార్యకలాపాలు శక్తిని మెరుగుపరుస్తాయి. స్క్రీన్ టైం తగ్గించనున్నాయి. బాలికలు వెనుక బడిన నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లల్లో సమా నత్వం పెరుగుతుంది. విద్యార్థులు సిబ్బందికి ప్రథ మ చికిత్స, అగ్ని భద్రత, విపత్తు, సంసిద్ధత, పాఠ శాల భద్రత, కసరత్తులో శిక్షణ ఇస్తారు. జీవ వైవి ధ్యం, మ్యాపింగ్, కిచెన్ గార్డెన్, నీటి ఆడిట్, వ్యర్థాల విభజన, వ్యవస్థల్లో పాల్గొనడం పర్యావరణ నిర్వహ ణలలో భాగస్వామ్యం కానున్నారు.

విద్యార్థుల్లో సామాజిక సేవ అలవడుతుంది

\- అయిలయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, బేకుర్తి



స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో సామాజిక సేవ అలవడుతుంది. మోడల్ స్కూల్లో 16 బాలురు, 16మంది బాలికలను ఎంపిక చేయడం జరిగింది. దీనికి 64వేల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగింది.

విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందుతుంది

\- లావణ్య, కేజీబీవీ స్పెషలాఫీసర్, శ్రీరాములపల్లె



విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఇవ్వడం ద్వారా దేశభక్తి పెంపొందుతుంది. అంతేకాకుండా క్రమశిక్షణ, అంకితభావం ఏర్పడుతుంది. కేజీబీవీలో 32మంది విద్యార్థులను ఎంపిక చేస్తాం. దీనికి నిధులు కూడా మంజూరయ్యాయి.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరి మృతి


రవీందర్‌రెడ్డి (ఫైల్)

ఇల్లంతకుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనుగువారిపల్లె గ్రామానికి చెందిన వంచ రవీందర్‌రెడ్డి (42) అనే యువకుడు మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వెళ్లి స్వగ్రామానికి వస్తుండగా చిన్నకోడూరు మండలం గంగాపూర్ సమీపంలో రోడ్డుపై పోసిన వరిధాన్యం కుప్పపై వాహనం ఎక్కగా కిందపడి మృతిచెందాడు. మృతునికి భార్య సుప్రియ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రవీందర్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

- ఒకరికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లారీ, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్జంపేట గ్రామానికి చెందిన బూర్క అశోక్ కాల్వశ్రీరాంపూర్‌లోని వార సంతలో కూరగాయలు కొనుగోలు చేసుకొని ద్విచక్రవాహనంపై మీర్జంపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇప్పలపల్లి గ్రామశివారులో ఓ టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అశోక్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే అతన్ని 108లో ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకటేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

ఇంటర్వ్యూ ప్రాణం తీసింది

● 26 సంవత్సరాల ప్రతీకారం ● సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్పీ ● మాజీ నక్సలైట్ సిద్ధన్న హత్యోదంతం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

వేములవాడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్వ్యూ మాజీ నక్సలైట్ ప్రాణం తీసింది. రూ.50వేలు ఇస్తే ఇంటర్వ్యూ ఇస్తానని చెప్పి పిలిచి ప్రాణం తీసుకున్నాడు. వేములవాడ మండలంలోని గుర్రవానిపల్లి ఎదురుగా ఉన్న అగ్రహారం గుట్టల్లో తంగళ్లపల్లి మండలంలోని గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న హత్యకు గురైంది తెలిసిందే. సిద్ధన్న హత్య విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల వేములవాడకు చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదుచేసి సిద్ధన్న మృతదేహానికి పంచనామా అనంతరం ఏరియా ఆసుపత్రికి తరలించామని టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో గండిలచ్చపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ మహేష్ బి. గీతే సందర్శించి పరిశీలించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో ఉన్న కుటుంబ సభ్యులతో ఎస్పీ మాట్లాడారు. 1990లో పీపుల్స్‌వార్ దళ సభ్యుడిగా చేరిన సిద్ధన్న దళ కమాండర్ స్థాయికి ఎదిగాడు. 2004లో పోలీసులకు లొంగిపోయి స్వగ్రామమైన గండిలచ్చపేటలో వ్యవసాయం చేసుకుంటున్నాడు. బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ ప్రాణాలను బలిగొంది.

● తండ్రి హత్యకు తనయుడి ప్రతీకారం

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన జక్కుల అంజయ్య ఇన్‌ఫార్మర్ పేరిట ఏప్రిల్ 9, 1999న అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్ల చేతిలో హత్యకు గురయ్యాడు. దీంతో అంజయ్యకు కుటుంబం వీధినపడింది. అప్పటినుంచి అతడి భార్య, పిల్లలు జగిత్యాలలోనే ఉంటు న్నారు. ఇటీవల ఓ యూట్యూబ్ చానల్‌కు పీపుల్స్‌వార్ మాజీ దళకమాండర్ హోదాలో సిద్ధన్న ఇంటర్వ్యూ ఇచ్చాడు. ఈ ఇంటర్వ్యూను చూసిన అంజయ్య కుమారుడు సంతోష్ తన తండ్రి హత్యకు కారణమైన సిద్ధన్నను హతమార్చాలని పథకం వేశాడు. వారం రోజుల క్రితం ఓ యూట్యూబ్ విలేకరిగా సిద్ధన్నకు ఫోన్‌చేసి పరిచయం చేసుకున్నాడు. ఇంటర్వ్యూ ఇవ్వాలని సిద్ధన్నను రెండు మూడు సార్లు కోరినప్పటికీ వీలుకాదని చెప్పిన సిద్ధన్న గురువారం ఇంటర్వ్యూకు వీలవుతుందని చెప్పగానే సంతోష్ జగిత్యాల నుంచి వెంటనే గురువారం సాయంత్రం 5గంటలకు సిరిసిల్లకు చేరుకున్నాడు. జనాల మధ్య సక్రమంగా రాదని గుట్టలు, చెట్లు ఉంటే ఇంటర్వ్యూ బాగుంటుందని సిద్ధన్నను నమ్మించి అగ్రహారం గుట్టల్లోకి తీసుకు వచ్చాడు. అప్పటికే పథకం ప్రకారం సిద్ధన్నకు కల్లు తాగించి బండరాయి తలపై ఎత్తివేసి దారుణంగా హత్యచేశాడు. ఆ తర్వాత మరో బండరాయిని తలపై వేసి సిద్ధన్న చనిపోయినట్లు నిర్ధారించుకొని నేరుగా అగ్రహారం నుంచి జగిత్యాలకు వెళ్లి పోలీసులకు లొంగిపోయాడు. ఆ తర్వాత వేములవాడ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

స్వగ్రామం చేరిన సిద్ధన్న మృతదేహం

\- దుబాయ్ నుంచి బయలుదేరిన కుమారుడు

తంగళ్లపల్లి: హత్యకు గురైన తంగళ్లపల్లి మండలంలోని గండిలచ్చపేట గ్రామానికి చెందిన బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరింది. సిద్ధన్నకు ఇద్దరు భార్యలు పోచవ్వ, ఎల్లవ్వలు, ఇద్దరు కుమారులు అశోక్, నరేశ్, ఒక కూతురు పద్మ ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు అశోక్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. తండ్రి హత్యకు గురైన విషయం తెలుసుకున్న కుమారుడు దుబాయ్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. శనివారం సిద్ధన్న అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆర్టీసీ స్థలం ఆక్రమించే యత్నం.. ఆరుగురిపై కేసు


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై చిరంజీవి

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ డిపో స్థలాన్ని కబ్జా చేయయానికి ప్రయత్నించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఆర్టీసీకి సంబంధించిన స్థలంలో రెండు రోజుల నుంచి కోరుట్ల పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు చదును చేసి నిర్మాణం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. డిపో మేనేజర్ మనోహర్ ప్రశ్నించంగా వారు దురుసుగా ప్రవర్తిచడంతో మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు స్థలం వద్దకు వెళ్లి ఎస్‌ఐ చిరంజీవి పరిశీలించారు. సరైన దస్తవేజులు లేకపోవ డంతో డిపో మేనేజర్ మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణానికి చెందిన పసుల చిన్ననర్స య్య, అతని భార్య వనిత, అతని కొడుకు నాగరాజు, అంబేద్కర్ నగర్‌కు చెంది న మాగోని మహేందర్, ఆకుల ఆనంద్, పాముల వెంకటరమణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి వివరించారు.

కోరుట్ల బల్దియాలో విజిలెన్స్ తనిఖీ


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కోరుట్ల నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బల్దియాలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం కార్యాలయంలోని వివిధ విభాగంలో అధికారులు ఏకకాలంలో దాడులను నిర్వహించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. రిజిస్టర్ బుక్, వాహనాల మరమ్మతులు, డీజిల్ కొనుగోలు బిల్లులకు సంబంధించిన రికార్డులను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీందర్‌తో పాటు మున్సిపల్ సిబ్బందిని వివిధ అంశాలపై విచారించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. విజిలెన్స్ తహసీల్దార్ దినేష్ ఉన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు : ఒకరి మృతి

పెద్దపల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని అందుగులపల్లి గ్రామశివారులో శుక్రవారం ఉదయం అతివేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అందుగులపల్లి గ్రామానికి చెందిన పిడుగు గోపాల్(45) ద్విచక్రవాహనంపై ధర్మారం ఎక్స్‌రోడ్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పెద్దపల్లి వైపు నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న పిడుగు గోపాల్ కిందపడగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

ఫ్లెక్సీ తొలగించారని నిరసన


నిరసన తెలుపుతున్న మృతురాలి కుటుంబ సభ్యులు

కొడిమ్యాల, నవం బరు 28(ఆంధ్ర జ్యోతి): తమ కూతురు తిప్పరవేని మధుశ్రీ శ్రద్ధాంజలి ఫ్లెక్సీని పంచాయతీ సిబ్బంది తొలిగించారని మండల కేంద్రానికి చెందిన తిప్పరవేని మమత నాగరాజు దంపతులు, కుటుంబ సభ్యులు శుక్రవారం సాయంత్రం కొడిమ్యాల కోనాపూర్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురై తమ కూతురు మృతిచెందిన బాధలో ఉంటే పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీ తొలించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఫ్లెక్సీల తొలిగింపులో భాగంగా కొడిమ్యాల గ్రామపంచాయతీ సిబ్బంది ఎన్నికల్లో పాల్గొనే నాయకుడి ఫొటోతో పాటుగా, పలువురు యువకులతో కలిసి ఉన్న ఫ్లెక్సీని తొలిగించకుండా మృతి చెందిన తమ కూతురు ఫ్లెక్సీ ఎందుకు తొలిగించారని అరగంట సేపు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ సౌందర్య, పోలీసులు, గ్రామ కార్యదర్శి ఎల్ వంశీవర్ధన్ సంఘటన స్థలానికి వచ్చి వారిని సమదాయించారు. అనంతరం శ్రద్ధాంజలి ఫ్లెక్సీ తిరిగి ఏర్పాటు చేయించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభ్యంతరం తెలిపిన ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలిగించారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

108 అంబులెన్స్ తనిఖీ


ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా కో-ఆర్డినేటర్ కుమారస్వామి తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న మందుల సమాచారం తెలుసుకున్నారు. మెడికల్ ఎక్విప్మెంట్స్ పనితీరుతో పాటు రికార్డులను పరిశీలించారు. ఎమర్జెన్సీ కేసులకు వెంటనే స్పందించాలని ఈఎంటీ ఆరే సతీష్, పైలట్ శ్రీనివాస్‌కు సూచించారు. ధర్మారం, జూలపల్లి మండలాల ప్రజలు అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దూర్ డబుల్ బెడ్‌రూం కాలనీవాసుల నిరసన


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. వారానికి ఒక్కసారి మిషన్‌భగీరథ నీరు వస్తోందని, సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం కాలనీని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ నాయకులతో కలిసి సందర్శించారు. కాలనీలో సమస్యలను తెలుసుకున్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ పట్టణంలోని ఇల్లు లేని నిరుపేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దూర్ శివారులో 450 డబుల్ బెడ్‌రూంలను నిర్మించి ఎలాంటి వసతులు లేకుండా లబ్ధిదారులకు ఇవ్వడంతో అక్కడ నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై మున్సిపల్ అధికారులతోపాటు జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కాలనీలో అన్ని వసతులతో పాటు నీటి సౌకర్యం కల్పించాలని అన్నారు. లేకుంటే మున్సిపాలిటీ ఎదుట కాలనీ ప్రజలతో తరలివచ్చి ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సూరం వినయ్, రచ్చరాహుల్, దేవరాజు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మాజీ కార్పొరేటర్ భార్య మృతి


కుర్ర తిరుమల(ఫైల్

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక ఎలుకల మందుతాగిన మాజీ కార్పొరేటర్ భార్య కుర్ర తిరుమల(40) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన తిరుమల కడుపునొప్పి భరించలేక ఈ నెల 26న ఎలుకల మందు తాగింది. వెంటనే ఆమె భర్త కుర్రతిరుపతి ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. తిరుమల సోదరుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దుబాయ్‌లో రోడ్డు ప్రమాదం

- లక్ష్మీపూర్ వాసి మృతి


గంగాధర్ (ఫైల్)

గొల్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం దుబాయ్‌కి వెళ్లిన గొల్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన గడప గంగాధర్ (45) ఈ నెల 16న దుబాయ్‌లో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఉన్న ఊరిలో ఉపాధి కరువై ఉపాధి కరువై 18 నెలల క్రితం అప్పులు చేసి గంగాధర్ దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఈ నెల 16న పనులు ముగించుకుని రూంకు వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు ట్రక్కు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. దీంతో అక్కడి పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా భద్రపరిచారు. తోటి మిత్రులు 18 రోజుల అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మీ, కుమారుడు మహేందర్, కుమార్తె ఆదా ఉన్నారు. మృతదేహంను త్వరగా స్వగ్రామానికి పంపించాలని, బాధిత కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

శంభునిపల్లి శివారులో మృతదేహం లభ్యం

హత్య చేసి గోనె సంచిలో చుట్టినట్లు పోలీసుల గుర్తింపు

జమ్మికుంట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శంభునిపల్లి-తనుగుల గ్రామాల మధ్య శుక్రవారం ఓ మృతదేహం లభ్యమైంది. హత్య చేసి మృతదేహాన్ని గోనె సంచిలో చుట్టి రోడ్డు పక్కన పత్తి చేనులో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. రోడ్డు వెంట దుర్వాసన వస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి చూశారు. గోనెసంచిలో మృతదేహం ఉన్నట్లు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి, పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్, ఎస్‌ఐలు క్రాంతికుమార్, సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఎదుట గోనె సంచుల నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పటికే రెండు, మూడు రోజులు గడిచిపోవడంతో మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. తీవ్రగాయాలైన ఆనవాళ్లు సైతం కనిపించాయి. మృతుడు 30-35సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నట్లు గుర్తించారు. చెవిపోగు, మెడలో సిల్వర్ కలర్ చైన్, కుడి చేతికి దేవుడి కంకణాలు, ఎడమ చేతికి రెడ్ కలర్ బ్యాండ్, బ్లాక్ కలర్ బ్యాండ్ ధరించి ఉన్నాయి. ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని పోలీస్‌లు కోరారు. క్లూస్ టీం మృతదేహం నుంచి కొన్ని శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు.

డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలం నుంచి పరిమల సొసైటీ రోడ్ వైపు కలివిడిగా తిరిగింది. హంతకులు ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చి పడేసి, ఆ తర్వాత పరిమల సొసైటీ రోడ్డులో సాఫీగా మద్యం సేవించినట్లు తెలుస్తోంది. డాగ్‌స్క్వాడ్ ఖాళీ మద్యం బాటిళ్లు ఉన్న వద్ద ఎక్కువ సేపు గడుపడం వల్ల పోలీసులు అనుమా నం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా కుళ్లిపోయిన మృతదేహానికి సంఘటన స్థలం వద్ద పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సర్పంచ్ ఎన్నికలకు 30 గుర్తులు

చొప్పదండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తులను విడుదల చేసింది. సర్పంచ్ అభ్యర్థుల కోసం 30, వార్డు సభ్యులకు 20 గుర్తులను కేటాయించింది.

● సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు

చెప్పులు, చెత్తడబ్బా, బెండకాయ, కొబ్బరితోట, టూత్ పేస్ట్, కత్తెర, ఉంగరం, బ్యాట్, ఫుట్‌బాల్, పర్సు, టీవీ రిమోట్, స్పానర్, బ్లాక్ బోర్డు, డైమండ్, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్స్‌మెన్, మనిషి తెరచాపతో పడవ, బిస్కెట్, గాలి బుడగ, క్రికెట్ స్టంపులు, చైన్, వేణువు కేటాయించగా వార్డు సభ్యులకు అదనంగా మరో 20 గుర్తులను కేటాయించింది.

28 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రూరల్ మండలంలోని పలు గ్రామాలలో బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్న వారితోపాటు ఎన్నికల్లో కేసులు నమోదైన పాత నేరస్థులు, రౌడీ షీటర్లు 28 మందిని శుక్రవారం బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచినట్లు, లక్ష రూపాయల సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

మల్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొండగట్టుకు చెందిన మనోజ్‌గౌడ్ ద్విచక్రవాహనంపై జగిత్యాల వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న గోగుల రవి ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి.



- దక్షతకు నియమాలతో కూడిన దీక్షలు
- పవిత్ర పదునెట్టాంబడి అధిరోహణ
- శబరిమల యాత్ర... జాగ్రత్త..

స్వామియే శరణం అయ్యప్ప

కరీంనగర్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణం అయ్యప్ప... అంటూ శరణుఘోషలు, భజనలతో పులకరిస్తూ కొనసాగించే అయ్యప్ప దీక్ష పవిత్రమైంది. కఠినమైంది. అనేక నియమ నిబంధనలతో కూడుకున్నది. దీక్షాధారి ఆధ్యాత్మిక, క్రమశిక్షణాయుత జీవితానికి అలవాటు పడుతాడు. దేహమే దేవాలయం, పరిశుభ్రతే పరమాత్మ అని నమ్మి దేహంతో పాటు ఇల్లు, పరిసరాలు, ఆలయాలు శుద్ధిగా ఉంచుకుంటూ దీక్షలు కొనసాగిస్తే దక్షత పెరుగుతుంది. ఆరోగ్యం, ఆధ్యాత్మికత, ప్రశాంతత, సరికొత్త జీవన విధానం ఏర్పడుతాయి. దీక్షల్లో స్థాయిలను బట్టి కన్నె, కత్తి, గంట, గద, గురు స్వాములుగా వ్యవహరిస్తుంటారు. ఏ స్థాయి స్వామి అయినా ప్రతి దీక్షాపరుడు అయ్యప్ప ప్రతిరూపంగా భావిస్తుంటారు. తొలిసారి దీక్షను స్వీకరించే వారు తల్లి లేదా గురుస్వామి చేతుల మీదుగా స్వీకరిస్తారు. దీక్షా కాలంలో నియమ నిబంధనలు, శబరిమల యాత్రా జాగ్రత్తలు తప్పకుండా పాటించాల్సిందే. వాటిని తెలుసుకుందాం.

● దీక్షా నియమాలు



- దీక్షాపరుడు పీఠాన్ని ఏర్పాటు చేసుకోవాలి.
- నలుపు రంగు దుస్తులు ధరించాలి. సంప్రదాయాలను అనుసరించి తిరుమణి, శ్రీచూర్ణం, విభూతి, చందనం, గంధం, కుంకుమ బొట్టు ధరించాలి.
- రెండు పూటలు నిత్య ఆరాధన చేయాలి. తొలిసారి దీక్ష తీసుకున్న వారు పెద్ద పాదం నడవాలి. ప్రతీసారి నడవవచ్చు.
- ఒకే పూట అన్నం, రెండో పూట అల్పాహారం స్వీకరించాలి.
- భూ శయ్య, బ్రహ్మచర్యం పాటించాలి. ఆధ్యాత్మిక పుస్తకాలు చదవాలి.
- పాద రక్షలు ధరించరాదు.
- రక్త సంబంధీకులు, పాలివాళ్ల మరణిస్తే మాల విసర్జన చేయాలి.
- అయ్యప్ప ధ్యానంలో గడపాలి.

● పదునెట్టాంబడి విశేషాలు...

వేద, పురాణ, ఇతిహాసాల్లో ఎన్నో విశేషాలున్నాయి. శబరిమలలో ఆలయానికి వెళ్లాలంటే 18 మెట్లు ఎక్కాలి. ఆ మెట్ల సోపానాన్నే పదునెట్టాంబడి అంటారు. కార్తిక మాసంలో దీక్ష చేపట్టిన దీక్షాపరులు పదునెట్టాంబడిని అధిరోహించి అయ్యప్ప స్వామిని దర్శిస్తారు. సన్నిధానం 18 గొప్ప పర్వతాల మధ్య ఉన్నందుననే 18 మెట్లు వచ్చాయని చెబుతారు.



నియమ నిబంధనలు పాటించాలి

- శ్రీభాష్యం శ్రీనివాసాచార్య గురుస్వామి



దీక్షాధారులు నియమ నిబంధనలు పాటించాలి. ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం. భక్తిభావన, ఆధ్యాత్మిక చింతన అవసరం. ఇతరులపై ప్రేమ, సోదరభావం, సహనం, గౌరవం, ఆదరాభిమానాలతో మెలగాలి. మన సారా స్వామిని మదిలో నిలుపుకోవాలి.

ఉమ్మడి జిల్లా పీడీఎస్‌యూ కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లోకిని రమేశ్, కూతాటి రాణాప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ నాల్గవ మహాసభల అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నూతన కమిటీని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కెంసారపు రవితేజ, అంగడి దేవేందర్, ఎండి అస్లామ్, జిల్లా సహాయ కార్యదర్శిగా మేడొడ్డి అజయ్, బుసారపు దిలీప్, అంగిడి దేవేందర్, జిల్లా కోశాధికారి కొయ్యడ రాకేశ్‌తోపాటు 19 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యు జాతీయ నాయకులు పి.మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, రాణాప్రతాప్ మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రీఎంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతూ జిల్లాలో పీడీఎస్‌యును మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తామని ప్రకటించారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మొలుగూరి రాజేశ్, లక్ష్మన్, బొతుకూరి చందు, పొడిశెట్టి అశోక్, కుర్ర అజయ్, సుంకరి హర్షవర్ధన్ పాల్గొన్నారు.

దుకాణాలను తనిఖీ చేసిన పోలీసులు

కొడిమ్యాల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దకాణాలను ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రాత్రి కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీ చేసారు. కొడిమ్యాల బస్టాండ్, అంగడిబజార్‌తో పాటుగా ఇతర ప్రధానమైన ప్రదేశాలలో బాంబ్ డిటెక్షన్ టీంతో తనిఖీ చేసారు. కిరాణం దుకాణాలను, టేలాలను ప్రత్యేకంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్. సందీప్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీ చేసామన్నారు. యువత మత్తు పదార్థాలకు రవాణాను అరికట్టడానికి సహకరించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువతను కోరారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శ్రీరాంసాగర్‌లోకి స్వల్పంగా నీరు

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం స్వల్పంగా నీరు వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 80.501 టీఎంసీలు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 948.168 టీఎంసీల నీరు వచ్చి చేరగా, ప్రాజెక్టు నుంచి 880.455 టీఎంసీల నీరును దిగువకు వదిలారు.

వేములవాడలో భక్తుల రద్దీ

● ఎల్‌ఈడీ స్క్రీన్‌పై రాజన్న దర్శనం

వేములవాడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై భక్తులు దర్శించుకున్నారు. శుక్రవారం దాదాపు 10వేలమంది భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అభిషేకం, అన్నపూజ, కళ్యాణాలు, ఇతర అర్జిత పూజలను నిర్వహించారు. ఎల్.ఇ.డి స్క్రీన్‌లో రాజన్నను దర్శించుకున్న భక్తులను ఆలయ ఇవో రమాదేవి ఆలయ ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ఎల్.ఇ.డిలో స్వామివారి దర్శనం ఎలా ఉందని భక్తులను అడిగితే బాగుందని చెప్పారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు బోనం సమర్పించారు.



ఎల్‌ఈడీ స్క్రీన్‌పై రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మానకొండూర్‌లో రైతుల రాస్తారోకో

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని మార్కెట్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసాన్ని నిరసిస్తూ రైతులు శుక్రవరాం ఆందోళనకు దిగారు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. స్థానిక సీఐ సంజీవ్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఒక్కో బస్తాలో 40.600 కిలోలు తూకం వేయాల్సి ఉండగా నిర్వాహకులు బస్తాకు 43 కిలోల తూకం వేస్తున్నారని రైతులు వివరించారు. దీంతో సంబంధిత అధికారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం తూకం వేయాలని సూచించారు. అనంతరం రైతులు రాస్తారోకో విరమించారు.



మానకొండూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

సర్పంచ్ పదవి కోసం పెళ్లి

● ఓటరు లిస్టులో పేరు నమోదు కాకపోవడంతో నిరాశ

గంగాధర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవి చేపట్టి గ్రామానికి సేవ చేయాలనే ఆలోచనలో ఉన్న ఓ యువకుడు హుటాహుటిన పెళ్లి చేసుకున్నాడు. అదే రోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఓటరు లిస్టులో భార్య పేరు నమోదు చేసుకునే వీలు లేకుండా పోయింది. ఎంతో ఆశతో సర్పంచ్‌గా పోటీ చేద్దామని పెళ్లి చేసుకున్న దంపతులకు నిరాశే మిగిలింది. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామం సర్పంచ్ ఎన్నికల్లో ఎస్సీ మహిళకు రిజ్వర్ చేశారు. గ్రామానికి చెందిన అవివాహితుడైన ముచ్చె శంకర్ తనకు అవకాశం లేకపోవడంతో హుటాహుటిన వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోహెడ మండలానికి చెందిన యువతిని ఈనెల 24న పెళ్లి చేసుకున్నాడు. ఆమెను ఓటరు లిస్టులో చేర్పించి సర్పంచ్‌గా పోటీ చేయించుదామనుకున్నాడు. అదే రోజు సాయంత్రం ఎన్నికల షెడ్యూల్ వచ్చింది. దీంతో శంకర్ భార్య పేరు ఓటరు లిస్టులో చేర్పించే అవకాశం లేకుండా పోయింది. సర్పంచ్‌గా పోటీ చేద్దామనుకున్న ఆ దంపతులకు నిరాశే మిగింది.



శంకర్ దంపతుల పెళ్లి ఫొటో

కోటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు

● రూ. 2,73,695 ఆదాయం

వెల్గటూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయం హుండీని శుక్రవారం లెక్కించారు. కార్తీక మాసం ముగిసిన సందర్భంగా హుండీ లెక్కించగా 2,73,695 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసంలో స్వామి వారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల భక్తులతో పాటు, ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చినట్లు తెలిపారు. గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారని అన్నారు. కోటేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్నిచర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రాజా మొగిలి, ధర్మకర్తలు గుమ్ముల వెంకటేష్ బుద్దె రవి, దేవి లావణ్య, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, భక్తులు, వెల్గటూర్ సేవా బృందం పాల్గొన్నారు.

కోతిని పట్టు.. సర్పంచ్ సీటు కొట్టు

- పంచాయతీ ఎన్నికల్లో 'కోతి' తిప్పలు
- వానరాల బెడద తీర్చినవారికే ఓట్లు
- గ్రామాల్లో తీర్మానాలు



జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే వారికి కోతులు కొత్త తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకు ఎక్కువవుతోంది. దీంతో పలు గ్రామాల్లో కోతుల బెడద తీరిస్తేనే ఓట్లేస్తామంటూ ఓటర్లు అంటున్నారు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్, మంచినీరు, పారిశుధ్యం వంటి సమస్యలను పక్కనబెట్టి కోతులను వెల్లగొడతాం.. ఓట్లేయ్యండి అంటూ ఆశావహులు ప్రచారం మొదలు పెడుతున్నారు. పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుడి స్థానాలకు పోటీచేసే వారు కోతుల సమస్యే ప్రధానంగా ఎజెండాగా ప్రచారంలో దిగుతున్నారు. కోతుల సమస్య తీర్చేవారినే సర్పంచ్‌గా కానీ, వార్డు సభ్యునిగా కానీ గెలిపిస్తామంటూ ఓటర్లు కూడా తెగేసి చెబుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీచేసే ఆశావహులు కూడా కోతులను పట్టించే పనులపై దృష్టిపెట్టారు. తమను గెలిపిస్తే కోతుల సమస్యను నివారిస్తామని హామీ ఇస్తున్నారు. పలు గ్రామాల్లో ముందుగానే అనధికార తీర్మానాలు చేసుకుంటున్నారు.

● ఎక్కువయిన దాడులు..

గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా జగిత్యాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా కోతుల బెడద ఎక్కువైంది. జిల్లాలో వేల సంఖ్యలో కోతులున్నాయని అంచనా ఉంది. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా కోతులు దాడులు చేస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడటంతో పాటు గుంపుగా దాడి చేయడంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటున్న సంఘటనలూ ఉన్నాయి. సంవత్సరానికి వంద మందికి పైగా గాయపడుతుండగా, చికిత్స కోసం వేల రూపాయల్లో వ్యయం చేస్తున్నారు. పంట పొలాలను ఇష్టారీతిన నాశనం చేసి రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి.

● తలకు మించిన భారం..

కోతులను పట్టుకోవడానికి మంకీ క్యాచర్లు ఒక్కో కోతికి వెయ్యి రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారు. అసలే నిధుల కొరత ఉండడంతో చేసేదేమీలేక అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఓటర్లు కూడా తమ సమస్య పరిష్కారానికి పంచాయతీ ఎన్నికలే సరయైన దిగా భావిస్తున్నారు. కోతుల సమస్య తీర్చిన వాళ్లకే తమ ఓట్లు వేస్తా మంటూ షరతులు విధిస్తుండడంతో అభ్యర్థులు కూడా ఆ పనిలో పడ్డారు.

రాష్ట్రస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టుకు ఎంపిక

పెగడపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్టు పోటీల్లో పెగడపల్లి మండలంలోని నామాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి సులోచన తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు 2025లో భాగంగా శుక్రవారం నిర్వహించిన టాలెంట్ టెస్టులో జిల్లాస్థాయిలో పలు మండలాల నుంచి పాల్గొన్న విద్యార్థులతో పోటీపడి నామాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎం శ్రీవర్ష, ఎ చైత్ర, సీహెచ్ సుస్మిత ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులను అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఈవో రాము అభినందించారు.

కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 4, 5 ఫిబ్రవరి 2026న 'భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు ప్రభావం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు.ఉమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కన్వీనర్ అర్థశాస్త్ర విభాగాధిపతి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కోడూరి శ్రీవాణి మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రి మ మేథస్సు ప్రభావం దాని పర్యవసానాలు అనే అంశాలపై మేధావులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ,పరిశో ధకులు, విద్యార్థులు డిసెంబర్ 30లోపు వ్యాసాలను పంపిం చవచ్చని తెలిపారు. ఉత్తమమైన వ్యాసాలను జర్నల్స్‌లో ప్రచురించనున్నట్లు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

ధర్మారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో మూడు రోజులుగా జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు వేడుకకు హాజరైన జిల్లా విద్యాధికారి శారద జిల్లా యువజన క్రీడ అధికారి ఏ సురేష్‌తోకలిసి విజేతలకు బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని 10ఉమ్మడి జిల్లాల నుంచి 244మంది ఈ టోర్నీలో పోటీపడగా లీగ్, సెమీ ఫైనల్స్ అనంతరం ఆరు జట్లు ఫైనల్‌కు చేరాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఫైనల్ మ్యాచుల్లో బాలుర విభాగంలో ఖమ్మం జట్టు మొదటిస్థానం సాధించగా, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో రెండో స్థానంలో వరంగల్ జట్టు సాధించగా మూడవస్థానంలో రంగారెడ్డి జట్టు నిలిచింది. బాలికల విభాగంలో రెండవ స్థానం మహబూబ్‌నగర్ జిల్లా జట్టు సాధించగా మూడవ స్థానాన్ని కరీంనగర్ దక్కించుకుంది. పోటీల నిర్వహణకు కృషిచేసిన ఎంఈవో ప్రభాకర్‌ను, టోర్నమెం ట్ ఆర్గనైజర్ బైకని కొమురయ్యను పలువురు అభినందించారు.



విజేతలకు బహుమతుల ప్రదానం

రోడ్డు పనులు చేపట్టాలని రాస్తారోకో

మానకొండూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్-జమ్మికుంట ప్రధాన రహదారి అన్నారంలో నిలిచిపోయిన రోడ్డు పనులను చేపట్టాలని గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక సీఐ సంజీవ్ అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు మాజీ సర్పంచ్ పప్పు ఆనంద, మాజీ వార్డు సభ్యుడు మేడి కొండయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర చెస్ జట్టు మేనేజర్‌గా రాజమల్లయ్య

కొడిమ్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్(పీడీ) బూట్ల రాజమల్లయ్యను రాష్ట్ర చెస్ జట్టుకు మేనేజర్‌గా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డాక్టర్ ఎ ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తాలలో ఈ నెల 27నుంచి 30వరకు నిర్వహిస్తున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టుకు మేనేజర్‌గా బాధ్యతలను స్వీకరించారు. శుక్రవారం ఫోన్ ద్వారా రాజమల్లయ్య 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.



రాజమల్లయ్య, పీడీ

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెద్ద వాగు నుంచి ఇసుక అక్రమంగా డంపు చేస్తున్న మూడు ఇసుక బ్లెడ్ ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. స్థానిక వాగులోని బతుమ్మ గాటు సమీపంలో వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. మూడు బ్లేడ్ ట్రాక్టర్లను రెవెన్యూ కార్యాయంకు తరలించి సీజ్ చేసినట్లు ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌లో..

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ బస్టాప్ వద్ద అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ గొల్లపల్లికి చెందిన కొత్తూరి కొంరయ్యపై కేసు నమోదు చేశామని, ట్రాక్టర్‌ను సీజ్ చేశామని పేర్కొన్నారు.

ఖర్చుల గుబులు

(5వ పేజీ తరువాయి)

ఖర్చులన్నింటిని ఆధారలతో సహా ఈసీకి సమర్పించాలి. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై అధికారుల నిఘా ప్రతినిత్యం ఉంటుంది. ఎన్నికల వ్యయానికి ఈసీ విధించిన పరిమితులకు మించి ఎనిమిది నుంచి పది రేట్ల వరకు ఖర్చులు ఉంటాయనేది బహిరంగ రహస్యమే అంటున్నారు.

రిజర్వేషన్...స్థానాన్ని బట్టి ఖర్చులు

గ్రామపంచాయతీ రిజర్వేషన్లను బట్టి ఎన్నికల ఖర్చులు మారనున్నాయి. జనరల్, బీసీ స్థానాల్లో ఖర్చు ఎక్కువ ఉండనుండగా, ఎస్సీ ఎస్టీ స్థానాల్లో ఒకింత తక్కువ ఖర్చు ఉండనుంది. ఈసారి జనరల్ స్థానాలే ఎక్కువ ఉండటంతో ఆర్థికంగా బలంగా ఉన్నవారు పోటీ పడేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే పదవులు చేపట్టిన వారితో పాటు కొత్తవారు సైతం పోటీకి సై అంటున్నారు. గత ఎన్నికల్లోనే సర్పంచులుగా గెలిచేందుకు రూ. లక్షల్లో ఖర్చు చేయగా మళ్లీ ఈ ఎన్నికల్లో ఖర్చులు పెరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీలో చేరిన మాజీ సర్పంచ్‌లు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న వికాస్‌రావు

కథలాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండ్రియాల, గంభీర్‌పూర్ మాజీ సర్పంచ్‌లు గడీల గంగప్రసాద్, గుంటుక మనోహర్ శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ మేరకు వేములవాడ నియోజవర్గ ఇన్‌చార్జి వికాస్‌రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, రాచమడుగు వెంకటేశ్వర్‌రావు, జలంధర్‌రెడ్డి ఉన్నారు,

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా..

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో గాజెంగి నందయ్యను పలువురు స్నేహ జాగృతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్నేహ జాగృతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కొక్కుల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కళ్యాణం శ్రీనివాస్, అల్లె గంగాధర్, హన్మాండ్లు, రాజేందర్, రాజబాబు, సతీష్, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో 17 కు.ని. ఆపరేషన్లు

జగిత్యాల అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం ఒకే రోజు 17 మంది పురుషులకు కుటుంబనియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్లు ఎన్ఎస్‌వి సర్జన్ డాక్టర్ వెంకటేష్ తెలిపారు. ప్రజల్లో కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించి వారు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా ప్రేరణ కల్పించి ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన వారందరికి జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ జీవి కృష్ణమూర్తి, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి, డాక్టర్ నరేష్, డాక్టర్ రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జెరియాట్రిక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ నరేష్

జగిత్యాల అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధుల కోసం జిల్లా ప్రధానాసుత్రిలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ నరేష్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక జెరియాట్రిక్ వైద్య సేవలు, కన్సల్టేషన్ జెరియాట్రిక్ వైద్యులచే పూర్తి ఆరోగ్య పరిశీలన మరియు కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. జిల్లా ఉప వైద్యాధికారి బి. శ్రీనివాస్ మాట్లాడుతూ వృద్ధులకు డయబెటిస్, రక్తపోటు, గుండె, మూత్ర పిండా సమస్యలు, మధుమేహం, లాంటి వృద్ధాప్య సంబందిత వ్యాదులకు చికిత్స పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, రిటైర్డ్ జీసి కృష్ణా రెడ్డి, గౌరిశెట్టి విశ్వనాథం, పిసి హన్మంత్ రెడ్డి, ఎఫ్ఆర్వో కొండయ్య పాల్గొన్నారు.

స్వశక్తి మహిళలకు రూ.2.15కోట్ల వడ్డీ మాఫీ

మల్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వశక్తి మహిళలకు రూ.2.15 కోట్ల వడ్డీ మాఫీ అయినట్లు సెర్ప్ అధికారు లు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 885 సంఘాల పరిధిలో డిసెంబరు-2023 నుంచి ఏప్రిల్-2024 వరకు అందించిన రూ.39.06 కోట్ల రుణాలు తీసుకున్న సభ్యు లకు రూ.82 లక్షలు, ఏప్రిల్-2024 నుంచి సెప్టెంబరు-2025 వరకు రూ.46.98కోట్లు రుణా ల పొందిన సభ్యులకు రూ.1.33కోట్లు వడ్డీ మాఫీ జరిగిందని పేర్కొన్నారు.

నిలిచిన పంపిణీ.. మూలనపడ్డ చీరలు

మల్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ చీరల పంపిణీ నిలిచిపోవడంతో మల్యాల సెర్ప్ కార్యాలయంలో మూలన పెట్టేశారు. గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్‌కు ఒక్క రోజు ముందు గ్రామాల్లో మహిళ సంఘాల్లోని 12,450 మంది సభ్యులకు చీరలను పంపిణీ చేయగా కోడ్ అమల్లోకి రావడంతో పంపిణీ నిలిపివేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ చీరల పంపిణీ కోసం కోడ్‌కు ఒక్కరోజు ముందు వేలాది చీరలు చేరుకోగా ప్రస్తుతం పంపిణీ నిలిపివేశారు.

ధర్మపురి మండల తపస్ కార్యవర్గం



తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నియామక పత్రాలను అందిస్తున్న రాష్ట్ర కార్యదర్శి రొట్టె శ్రీనివాస్

ధర్మపురి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ధర్మపురి మండల శాఖ ఎన్నికలు శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర శాఖ కార్యదర్శి రొట్టె శ్రీనివాస్ పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రొట్టె శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇన్ సర్వీసెస్ టీచర్లకు టెట్ మినహాయింపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన కోరారు. అనంతర తపస్ ధర్మపురి మండల అధ్యక్షుడిగా బోరపురెడ్డి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా మారంపెల్లి రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా బండి ప్రవీణ్, బక్కశెట్టి రవీందర్, కోశాధికారిగా గడిపెల్లి కిరణ్, కార్యదర్శులుగా కాశెట్టి వెంకటరమణ, ఎస్ కన్నంనాయుడు, సంయుక్త కార్యదర్శిగా బుగ్గారపు హరీష్‌ను ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా సంద వెంకటేష్, ఎస్. రమేష్, చల్ల కృష్ణ, బి మల్లేష్, బి రాజయ్య, మహిళా బాధ్యులుగా ఇందారపు రమాదేవి, రొట్టె సరిత, కాశెట్టి శారద, గడిపెల్లి అనూష, టి రేవతి, జి భాగ్యలక్ష్మీ, ఎం మమతను ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్స్‌గా బండి మహేష్, కాశెట్టి రమేష్, శీలం రాజేష్, కనపర్తి సంతోష్, కాశెట్టి శ్రీనివాస్, గొల్లపల్లి రాజేశ్వర్, గుండ రమేష్, ఎస్. విష్ణు, శ్రావణ్ తదితరులను ఎన్నుకున్నారు.

ఎన్నికల విధులు అత్యంత కీలకం

- పంచాయతీ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రమేష్

మెట్‌పల్లి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల విధులు అత్యంత కీలకమని పంచాయతీ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఎలక్షన్ నోటీస్, ఓటర్ల జాబితా, హెల్ప్ డెస్క్‌లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రశాంత వాతావరణంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగే లా రిటర్నింగ్ అధికారులు చూడాలన్నారు. నామినేషన్ నుంచి చివరి ఫలితాల ప్రకటన వరకు ప్రతి ఒక్క అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏ సందే హం ఉన్నా వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించా లని సూచించారు. నామినేషన్ల దాఖలుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసు కోవాలని సూచించారు. గ్రామాల వారీగా స్వీకరించిన నామినేషన్ పత్రాలను వేరువేరుగా భద్రపరచాలని ఆదే శించారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవి, చిన్న పొరపాటుకు కూడా అవకాశం ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రాజేందర్, ఏఆర్‌వో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి రవి, సిబ్బంది పాల్గొన్నారు.



చౌలమద్దిలోని నామినేషన్ స్వీకరణ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల అబ్జర్వర్ రమేష్

అబ్జర్వర్‌ను కలిసిన ఎస్టీయూ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్: ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిలాంటి ఎన్నికల ప్రక్రియలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్, జిల్లా ఎన్నికల పరిశీలకులు గాజర్ల రమేష్ అన్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా జగిత్యాల జిల్లా ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన గాజర్ల రమేష్‌ను జిల్లా ఎస్టీయూ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సమర్థవంతంగా నిర్వర్తించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి తూచా తప్పకుండా పాటించి పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అనారోగ్య ఇబ్బందులు, ఫీడింగ్ మదర్, రిటైర్మెంట్‌కు అతి దగ్గరలో ఉన్న ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు గురించి ఎస్టీయూ నాయకులు రమేష్‌ను కోరగా, సానుకూలంగా స్పందించారు. డీఈవో రాము, డీఆర్‌డీవో రఘువరణ్‌తో కలిసి ఎస్టీయూ జిల్లా శాఖ పక్షాన పుష్పగుచ్ఛం అందజేశారు. అధ్యక్ష, కార్యదర్శులు భైరం హరికిరణ్, పాలెపు శివరామకృష్ణ, మచ్చ శంకర్, ట్రెజరర్ మేకల ప్రవీణ్, కథలాపూర్, రాయికల్ మండలాధ్యక్షులు నల్ల రాజ్‌కిరణ్, విద్యామణి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా జ్యోతిబాపూలేకు ఘన నివాళి

గొల్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెలివాడలకు అక్షరదారులు వేసిన విద్యా ప్రదాత, మహానీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని వక్తలు కొనియాడారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతిని ముదిరాజ్ సంఘం యువజన సంఘం కోమల్ల జలేంధర్ ఆధ్వర్యంలో జ్యోతిభాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోమల్ల జలేంధర్, బీఆర్ఎస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు బలభక్తుల కిషన్, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

మెట్‌పల్లి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉచిత డయాబెటిక్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. 124 మందికి పరీక్షలు చేయించుకున్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాసరావు కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

82 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

కథలాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 82వేల క్వింటాళ్ల కొనుగోలు చేసినట్టు ఏపీఎం చిన్నరాజయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని అంబారిపేటలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోళ్లు వేగవంతం చేస్తున్నామని రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

ఎస్‌జీఎఫ్ అండర్ 17 రగ్బీ పోటీలకు ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 9వ తరగతి విద్యార్థిని మైత్రి 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 17 రగ్బీ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6న కరీంనగర్‌లో జరిగిన జోనల్ స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబర్చి, ఈ నెల 29 నుంచి డిసెంబరు 1 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని డోర్నకల్‌లో జరిగే 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 17 రగ్బీ పోటీలకు ఎంపికైంది. పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు విద్యార్థిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత తదితరులు ఉన్నారు.

రెండో రోజు నామినేషన్ల కోలాహలం

జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం కోరుట్ల, భీమారం, మెట్‌పల్లి, మల్లాపూర్, కథలాపూర్ మండలాల్లో నామినేషన్ల కోలాహలం నెలకొంది. పలువురు అభ్యర్థులు తమ అనుచర గణంతో ర్యాలీగా వచ్చి నామినేషన్లు వేశారు.

కోరుట్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 గ్రామపంచాయితీలతో పాటు 152 వార్డులకు రెండవ రోజు 25 సర్పంచ్, 53 వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖాలు అయినట్లు ఆయా క్లస్టర్ల ఎన్నికల అధికారులు తెలిపారు. అయిపూర్ గ్రామ సర్పంచ్‌కు రెండు నామినేషన్లు, వార్డు సభ్యులకు ఎనిమిది నామినేషన్లు వచ్చాయి. చిన్నమెట్‌పల్లి సర్పంచ్‌కు ఒకటి, ధర్మారం సర్పంచ్‌కు రెండు, జోగినిపల్లి సర్పంచ్‌కు ఒకటి, వార్డు సభ్యుడికి ఒకటి, కల్లూర్ సర్పంచ్‌కు ఒకటి, గుమ్లాపూర్ వార్డు సభ్యులకు రెండు, మాదాపూర్ సర్పంచ్‌కు ఒకటి, వార్డు సభ్యులకు ఎనిమిది, మోహన్‌రావుపేట సర్పంచ్‌కు మూడు, వార్డు సభ్యుకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నాగులపేట సర్పంచ్‌కు రెండు, వార్డు సభ్యులకు ఎనిమిది, పైడిమడుగు సర్పంచ్‌కు ఐదు, వార్డు సభ్యులకు 11, సర్పరాజుపూర్ సర్పంచ్‌కు రెండు, వార్డు సభ్యులకు రెండు, తిమ్మయ్యపల్లి గ్రామ సర్పంచ్‌కు రెండు, యూసుఫ్‌నగర్ గ్రామ సర్పంచ్‌కు రెండు, వార్డు సభ్యులకు ఐదు నామినేషన్ వచ్చాయి. ఇప్పటి వరకు గుమల్లాపూర్ సర్పంచ్ పదవికి ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. వెంకటాపూర్ గ్రామ సర్పంచ్‌తో పాటు ఏవార్డుకు కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాకపోవడం విశేషం. రెండు రోజుల్లో వివిధ గ్రామాల సర్పంచ్ పదవులకు 31 నామినేషన్లు, వార్డు సభ్యులకు 58 నామినేషన్ల వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.



మెట్‌పల్లి రూరల్: మండలంలోని గ్రామాల్లో 41 మంది సర్పంచుకు, 82 మంది వార్డు మెంబర్ల స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో సురేష్ తెలిపారు.

మల్లాపూర్: మండలంలో సర్పంచ్ పదవికి 49 మంది, వార్డు సభ్యులకు 46 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ తెలిపారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఐదు క్లస్టర్లలో 35 సర్పంచ్, 73 వార్డు మెంబర్ స్థానాలకు నామినేషన్లు దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఇందులో తిమ్మాపూర్ క్లస్టర్‌పరిధిలో 11 సర్పంచ్, 29 వార్డు మెంబర్, ఇబ్రహీంపట్నం పరిధిలో ఒకటి సర్పంచ్, 3 వార్డు మెంబర్, ఐకేపీ క్లస్టర్ పరిధిలో ఆరు సర్పంచ్, ఐదు వార్డు మెంబర్, వర్షకుండ క్లస్టర్‌లో 9 సర్పంచ్, 24 వార్డు సభ్యులు, వేములకుర్తి పరిధిలో 8 సర్పంచ్, 12 వార్డుసభ్యుల స్థానాలకు నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు.

కథలాపూర్: మండలంలోని ఆరు క్లస్టర్లలో సర్పంచ్ పదవి కోసం 39, వార్డుసభ్యుల కోసం 103 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు.

భీమారం: మండలంలో రెండోరోజు సర్పంచ్ స్థానానికి 35, వార్డు మెంబర్ స్థానాలకు 50 నామినేషన్లు వచ్చాయని అధికారులు తెలిపారు. సర్పంచ్ స్థానాలకు భీమారంలో ఒకరు, కమ్మరిపేటలో నలుగురు, గోవిందారంలో ఒకరు, పసునూరులో ఇద్దరు, రాజలింగంపేటలో ఆరుగురు, మోత్కురావుపేటలో నలుగురు, మన్నెగూడెం, లింగంపేట, దేశాయిపేట వెంకట్రావుపేట, ఒడ్యాడ్ గ్రామాల్లో ముగ్గురు చొప్పున, రాగోజీపేటలో ఇద్దరు నామినేషన్లు వేశారు. భీమారం మండల కేంద్రంలో నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెబ్బబోయిన గోపి పరిశీలించారు. మేడిపల్లి, భీమారం మండలాల అధ్యక్షులు చిట్యాల సురేష్, నాగం శివకుమార్, కరీంనగర్ కో కన్వీనర్ క్యాతం దశరథ రెడ్డి ఉన్నారు.

లోకమాత పోచమ్మ దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పురానిపేట లోకమాత పోచమ్మ అమ్మవారి దీవెనలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురానిపేట లోకమాత పోచమ్మ ఆలయంలో శుక్రవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించగ, వేదపండితులు అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచానాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే లోకమాత పోచమ్మ తల్లి అని, ఆ తల్లిని దర్శించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. జిల్లా ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు, కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వంపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని కోరుకున్నట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ హామీల అమలుకు శక్తిని ఇవ్వాలని కోరారు. ఏ హోదాలో ఉన్న తనకు సమయం ఉన్నప్పుడల్లా అమ్మవారిని దర్శించుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, మాజీ సర్పంచ్ గాజెంగి భారతి, టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బండ శంకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, మాజీ ఫ్లోర్ లీడర్ కండ్లపల్లి దుర్గయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు

మల్లన్న స్వామిని దర్శించుకున్న మంత్రి

ఎండపల్లి: మండల కేంద్రంలోని పర్వతాల మల్లన్న స్వామిని ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, నాయకులు మద్దుల గోపాల్‌రెడ్డి, మొహమ్మద్, అబి, పొట్లపల్లి సత్యనారాయణరావు, తోడేటి బాల్‌లింగంగౌడ్, కందికట్ల రాజేశం ఉన్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

రాయికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు సుతారి ధర్మయ్య సౌదీలో రోడ్డు ప్రమాదంలో మరణించగా సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) రియాద్ వారి ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువైన చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా శుక్రవారం ధర్మయ్య కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సాటా అధ్యక్షు డు మచ్చ శ్రీనివాస్, క్యాదాసు నవీన్, క్రాంతి, మల్లేశన్, శర్వాణి, విద్యాధరణి, కోకిల, ప్రీతి చౌహాన్, సునీత, అవినాష్, ముదిగొండ శంకర్, నూరుద్దీన్, ఖాజా ముజమ్మిల్ ఉద్దీన్, దూడం సంజీవ్, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లాల రాజేందర్ తండ్రి నారాయణ రెడ్డి గురువారం మరణించగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. భూపతిపూర్ పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి తండ్రి ఏనుగు చిన్నారెడ్డి మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు మోర హన్మాండ్లు, ఏనుగు మల్లారెడ్డి, గన్నె రాజరెడ్డి, కోల శ్రీనివాస్, రవీందర్ రావు ఉన్నారు.

సర్పంచ్‌గా పోటీ చేయడానికి అర్హతలు ఇవే..

గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సర్పంచ్‌గా పోటీచేసే అభ్యర్థి అర్హతలు, నామినేషన్ వేసే విధానం తదితర వివరాలు మీ కోసం..

- అభ్యర్థి కనీసం 21 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలి.
- ఏ గ్రామంలో పోటీ చేస్తే ఆగ్రామంలో ఓటర్‌గా నమోదై ఉండాలి.
- క్రిమినల్ కేసుల్లో శిక్ష పడటం, దివాలా తీయడం, ప్రభుత్వానికి లేదా స్థానిక సంస్థలకు బకాయిలు ఉంటే అభ్యర్థిని అనర్హుడిగా ప్రకటించవచ్చు.
- పోటీచేసే స్థానం ఏదైనా రిజర్వేషన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళకు కేటాయించబడి ఉంటే, ఆ రిజర్వేషన్ వర్గానికి చెందినవారై ఉండాలి.

నామినేషన్ ప్రక్రియ...

- సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లను స్వీకరించడానికి ఎన్నికల సంఘం తరఫున ఒక రిటర్నింగ్ అధికారిని నియమిస్తారు.
- అభ్యర్థి గ్రామపంచాయతీ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నిర్ణీత నమూనా (ఫారం) లో నామినేషన్ పత్రాన్ని పూరించాలి.
- స్వీయ ప్రకటన (సెల్ఫ్ డిక్లరేషన్): నేర చరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు మొదలైన వివరాలతో కూడిన స్వీయ ప్రకటన పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలి.

అవసరమైన పత్రాలు..

- ఓటర్ జాబితాలో పేరు, రిజర్వేషన్ వర్గానికి చెందినవారైతే కుల ధ్రువీకరణ పత్రం, సంతానం వివరాల పత్రం, డిపాజిట్ చెల్లించిన రసీదు, స్వీయ ప్రకటన పత్రం మొదలైనవి సమర్పించాలి.
- అభ్యర్థి స్వయంగా లేదా అతని లేదా ఆమె ప్రతిపాదకుడి ద్వారా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించాలి.
- స్క్రూటినీ రోజున నిర్ణీత సమయానికి రిటర్నింగ్ ఆఫీసర్ ఎదుట హాజరుకావాలి.

\- జగిత్యాలరూరల్

చిన్న నీటి వనరుల లెక్కను పకడ్బందీగా చేపట్టాలి

ధర్మపురి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్న నీటి వనరుల లెక్కను పగడ్బందీగా, శాస్త్రీయంగా చేపట్టాలని సీపీవో సత్యం పేర్కొన్నారు. ధర్మపురి శివారులో గల రైతు వేదిక వద్ద నీటి వనరుల గణనపై క్షేత్రస్థాయి శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీవో సత్యం మాట్లాడుతూ ధర్మపురి, బీర్‌పూర్ మండలాల్లో ఉన్న చిన్న నీటి వనరుల లెక్కను శాస్త్రీయంగా చేపట్టాలని అన్నారు. చెరువులు, కుంటలు, వాగులు, లిఫ్ట్ ఇరిగేషన్ నీటి నిల్ల ప్రాంతాలు, బోర్‌వెల్స్‌కు సంబంధించిన సమగ్రంగా వివరాలు సేకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ధర్మపురి, బీర్‌పూర్ మండలాల తహసీల్దార్లు ఏరుకొండ శ్రీనివాస్, సుజాత, డీవైఎస్‌వో రామకృష్ణ, ఎంపీఎస్‌వో అశ్విని, బీర్‌పూర్ ఆర్‌ఐలు రాహుల్, శ్రీనివాస్, జీపీవోలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు. .

వెల్గటూర్: మండలం లోని వివిధ గ్రామాలలో శుక్రవారం చిన్న తరహా నీటి వనరుల గణన శిక్షణ కార్యక్రమం చేపట్టినట్లు మైనర్ ఇరిగేషన్ అధికారి, తహసీల్దార్ శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ చిన్న తరహా నీటి వనరుల గణన, 2వ జలాశయాల గణన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలలోని చెరువులు, బావులు మరియు ఇతర నీటి వనరులను ప్రత్యక్షంగా సందర్శించి మొబైల్ అప్ ద్వారా డిజిటల్ పద్ధతిలో గణన చేసి నమోదు చేసేలా ఎన్యూమరేటర్లలకు క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సెన్సెస్ అధికారి రామకృష్ణ, సీపీవో సత్యం, ఎంపీఎస్‌వో శిరీష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరి, రాంరెడ్డి, గ్రామ పాలనా అధికారులు పాల్గొన్నారు.



వెల్గటూర్‌లో నీటి వనరులను పరిశీలిస్తున్న అధికారులు

వైద్య విద్యార్థులకు క్విజ్ పోటీలు

జగిత్యాల అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించకుని జగిత్యాల వైద్య కళాశాల విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ ఏయిడ్స్ వ్యాధి లక్షణాలు అది వ్యాపించే విధానం, చికిత్స గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరు ఏయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ జీవీ కృష్ణ మూర్తి, జిల్లా ఉప వైద్యాధికా రులు బి శ్రీనివాస్, ఎం జైపాల్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ సునీల్, వైస్ ప్రిన్సిపాల్ అర్చన, ఏయిడ్స్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. క్విజ్‌పోటీల విజేతలకు డిసెంబరు 1న బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

53వ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని స్థానిక ఓల్డ్ హైస్కూల్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజాగౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి, పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా కాలానుగుణంగా బాల శాస్త్రవేత్తలను తయారుచేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనకు జిల్లా స్థాయిలో 350 ప్రదర్శనలు, 13వ ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుకు సంబంధించి 118 ప్రదర్శనలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రాము, ఎస్‌ఇఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్‌లు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

బీసీలకు అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

ధర్మపురి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి కేవలం 17 శాతం మాత్రమే అమలు చేసి తీరని అన్యాయం చేసిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని హరిత హోటల్‌లో బీజేపీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోసానికి మరో రూపం కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీసీలు రేవంత్‌రెడ్డిని ఆకాశానికి ఎత్తితే బీసీల పట్ల భస్మాసుర హస్తం అయి కూర్చొన్నాడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బెజ్జారపు లవణ్, నియోజకవర్గ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.